గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల మహిళలు ఉదయం నిద్ర లేవగానే వాకిలి ఊడ్చి, ఆవుపేడ నీళ్లు చల్లి, ముగ్గులు పెడతారు. ఇలా, ఆవుపేడ నీళ్లు చల్లడాన్నే కళ్లాపి చల్లడం, చాన్పి చల్లడం అంటారు. కొందరు రోజు వారీ కాకపోయినా పండుగలు వంటి ప్రత్యేక సందర్భాల్లో పేడనీళ్లతో కళ్లాపి చల్లుతారు. పూజ చేసుకుంటున్న ప్రాంతాన్ని ముందుగా గోమయం (ఆవుపేడ)తో శుద్ధి చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ విధంగా ఆవుపేడ నీటితో స్థలాన్ని శుద్ధి చేయటం, చాన్పి చల్లడం వెనుక ఎన్నో వైజ్ఞానిక అంశాలు ఉన్నాయి.

# చాన్పి వెనుక శాస్త్రం

సనాతనం



వర్తమానంలో మనం అనేక కారణాల వల్ల రేడియేషన్ ప్రభావానికి గురవుతున్నాం. ఈ రేడియేషన్ బారి నుంచి ఆవుపేడ మనల్ని కాపాడుతుంది. ఆవుపేడతో అలికిన ప్రాంతం రేడియోధార్మికశక్తిని నిరోధిస్తుందని పరిశోధనల్లో నిరూపితమైంది. ఇంటి పైభాగంలో ఆవుపేడతో అలికితే ఇంట్లోకి రేడియోధార్మికత ప్రవేశించదు. ఆవుపేడ యాంటి-సెప్టిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ కారణంగానే పవిత్ర ప్రదేశాల్లో, వంటగదిలో, ఇల్లంతా ఆవుపేడను అలికే సంప్రదాయం ఏర్పడింది. ఆవుపేడతో అలికిన ప్రాంతం హానికారక బ్యాక్టీరియాకు దూరంగా ఉంటుంది.

దేశవాళీ ఆవు పేడ కలిపిన నీటినే కళ్లాపిగా చల్లుతారు. ఎందుకంటే, భారతీయ గోవుకు ఉన్న గొప్ప శక్తి మరే ఇతర గోవులకు లేదు. ఆవుపేడ క్రిమి సంహారిణి. అంతేకాదు దేశీ ఆవుల మూత్రంలో, పేడలో ఎన్నో ఉపయోగకరమైన మిత్రక్రిములు ఉంటాయి. కేవలం వాటి ద్వారా మాత్రమే మనం భూమిని సారవంతం చేయవచ్చు. ఒక గ్రాము దేశీ ఆవు పేడలో 300 కోట్ల మిత్ర క్రిములు ఉన్నాయని పలు పరిశోధనల్లో తేలింది. మిత్రక్రిములు (మంచి బ్యాక్టీరియా) అంటే భూమికి, మనిషికి, ప్రకృతికి మేలు చేకూర్చేవి. మనిషి శరీరంలో కూడా కొన్ని మిత్రక్రిములు ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థ సజావుగా సాగడంలో ప్రధానపాత్ర పోషిస్తాయి. యాంటి-బయాటిక్స్ అధికంగా సేవించడం వల్ల ఇవి నశించి, ఉదర, పేగు సంబంధిత రోగాలు వస్తాయి. దేశవాళీ ఆవుపేడలో ఉండే మిత్రజీవాలు కూడా అందరికి మేలుచేస్తాయి. జీవరాశి నుంచి వెలువడిన మలం అత్యంత రోగకారకమైందిగా ఉంటుంది. కానీ, దేశవాళీ ఆవుపేడ మాత్రం అందుకు పూర్తి భిన్నం. అది ఆరోగ్యానికి హేతువు.



ఈ నాటికి కొన్ని తెగలవారు బాలింతలకు జ్వరం వచ్చినప్పుడు చికిత్సకు ఆవుపేడనే ఉపయోగిస్తారు. ఆవుపేడను నీటిలో కలిపి చల్లడం వలన ఇంటిలోనికి ఈగలు, దోమలు రావు. ఇన్ని విశిష్టతలు ఉన్నాయి కనుకే ఆవుపేడతో కళ్లాపి చల్లుతారు. ఇల్లు అలుకుతారు. ఇంటిని శుభ్రం చేయడానికి వాడే ఫినాయిల్, ఇతర వస్తువులు మొదలైనవి శ్వాసకోశ సంబంధిత వ్యాధులను కలిగిస్తాయి. పాదాల పగుళ్లకు కూడా ఇవి ఒక కారణం. రసాయనికమైన ఫినాయిల్‌కు భిన్నంగా ఆవుపేడ కళ్లాపి చల్లడం ద్వారా విడుదలయ్యే వాయువులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులను నివారిస్తాయి. ఈ విధంగా గోమయం అనేకరకాలైన వ్యాధులను నివారించడంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నది. ఇంతటి సర్వోన్నతమైన వైజ్ఞానిక కోణం ఉన్నది కాబట్టే, మన పూర్వీకులు ఆచారాలు, సంప్రదాయాలు, శాస్త్రాలు పేరుతో ఆవుపేడ నీటితో చాన్పి చల్లడాన్ని మన సంస్కృతిలో భాగం చేసారు.

... శ్రీ భారతి

# ఖురాన్ చూపిన బాటలో..

అల్లాహ్ ద్వారా మానవాళి కోసం అవతరించిన దివ్య గ్రంథం.. 'ఖురాన్'. ఇహ, పరాల్లో జీవిత సాఫల్యతకు దారిచూపే నైతిక సూక్తుల భాండాగారం ఈ గ్రంథరాజం. ఖురాన్‌లోని విషయాలు సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంటాయి. మనుషులు ఎలా జీవించాలి? స్త్రీ, పురుషులకు ఉండే వేర్వేరు బాధ్యతలు ఏమిటి? మానవత్వానికి అర్థం ఏమిటి? ధైర్యానికి నిర్వచనం ఏమిటి? వివాహ ధర్మాలేమిటి?.. ఇలా మనిషి జీవితానికి సంబంధించిన సమస్త అంశాలకు మార్గనిర్దేశం చేసే అంశాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆ గ్రంథంలోని ముఖ్యాంశాలను మననం చేసుకుని మనసా, వాచా, కర్మణా ఆచరిద్దాం.

### మన నైతికత..

ఎప్పుడూ సత్యాన్నే మాట్లాడాలి. ఎక్కువమంది చెప్పిందే సత్యమని భ్రమపడకుండా ప్రవక్తలు చెప్పిన సత్యాలనే నిజమని నమ్మాలి. ఎదుటివారికి నీతులు బోధించే ముందు మనం వాటిని ఆచరించాలి. ఇచ్చిన మాట మీద నిలబడాలి. ఇతరులు మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదు. ఎవరినీ గుడ్డిగా అనుసరించకూడదు. వడ్డీకి అప్పు ఇవ్వరాదు. పాపపు పనులు, దౌర్జన్యాలు చేసే వారికి సహకరించకూడదు.


### సమాజంతో..

ఇతరులతో మృదువుగా మాట్లాడాలి. పరిచయస్తులతో ఆప్యాయంగా మెలగాలి. ఇతరుల సంపదను అయాచితంగా ఆశించకూడదు. ఒకరి ఉన్నతిని చూసి అసూయ చెందకూడదు. వీలైతే మంచిపనుల్లో ఇతరులకు తోడ్పాటు అందించాలి. ఇతరుల రహస్యాలు వినకూడదు. ఒకరి గురించి ఇంకొకరికి చాడీలు చెప్పకూడదు. ఇతరుల తగాదాలకు తీర్పు చెప్పాల్సి వచ్చినప్పుడు న్యాయం ఎటువైపు ఉందో వారికి అనుగుణంగా తీర్పునివ్వాలి. తప్పు చేసినవారికి తగిన శిక్షను విధించాలి. ఇతర మతాల విశ్వాసాలనూ గౌరవించాలి. వారితో సామరస్యంగా మెలగాలి. అన్న పానీయాలను వ్యర్థం చేయకుండా తగినంత మాత్రమే తీసుకోవాలి.

### దైవారాధన..

అల్లాహ్ ప్రసన్నత కోసం పాటుపడాలి. నిరుపేదలకు సాయం చేయడం కూడా దైవారాధనే అని తెలుసుకోవాలి. అల్లాహ్ కారుణ్యం ఆలస్యమైనా నిరాశ చెందకుండా నిరీక్షిస్తూ ఉండాలి. సన్యాసం జోలికి పోకుండా సంసార బాధ్యతలను నిర్వహిస్తూనే దైవాన్ని ప్రార్థించాలి. పరిశుద్ధతను పాటిస్తూ ఖురాన్ పఠించాలి. తరచూ సంప్రదాయ వస్త్రధారణలో మసీదుకు వెళ్లి నమాజ్ చేయాలి. మసీదులకు వెళ్లే వారికి అడ్డు పడకుండా దారి ఇవ్వాలి. పరిశుభ్రతను పాటించాలి.

ఇస్లాం బోధ



### పౌరుల విధులు..

లంచగొండితనానికి పాల్పడకూడదు. శత్రు దేశంతో యుద్ధం వచ్చినప్పుడు వెన్ను చూపకూడదు. శత్రువులతో చేతులు కలిపి మనం ఉంటున్న రాజ్యానికి ద్రోహం చేయకూడదు. రాజ్యాధికారానికి అర్హత కల వారినే పాలకులుగా ఎన్నుకోవాలి. మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదు, వాటిని అమ్మకూడదు. జూదానికి దూరంగా ఉండాలి. వ్యాపారం చేస్తున్నట్టయితే కొలతలు, తూనికలలో మోసాలకు పాల్పడకూడదు. నిస్సహాయులు ఎవరైనా శరణు కోరితే, వారికి కొంతకాలం మన ఇంట్లో ఆశ్రయమివ్వాలి. ఇతరులతో పని చేయించాల్సి వచ్చినప్పుడు వారి సామర్థ్యానికి మించి భారం వేయకూడదు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076



శుక మహర్షి పరీక్షిత్తుతో-
రాజా! జలజ నేత్రుడు,
ఖల విదారి కృష్ణుడు బలరామ
సహితుడై కోటలు, విశాలమైన
బాటలు, శృంగాటకములు-
చతుష్పథాలు, హాటక
(బంగారు) భవనాలు, ధనాలు,
ధాన్యాలు, ఉద్యానవనాలు,
ఘోటకాలు, పోటుదొరలు-
రణశూరులు, రథాలు,
ధ్వజాలు, భద్రగజాలు, సామజ
గమనలు- అందగత్తెలతో కూడి
అత్యద్భుతమైన కళతో మిల
మిల మెరిసిపోతున్న మధురా
నగరాన్ని కలయ చూచాడు.
పురవీధుల్లో నడచి వస్తున్న
స్మర జనకుని పురుషోత్తముని
తిలకించి పులకించిన
కలకంఠులు కలతలు-
మనస్తాపాలు మాని...


# గోవిందుని మధురావిందులు

ఉ|| 'నందు తపఃఫలంబు, సుగుణంబుల పుంజము గోపకామినీ
బృందము నోము పంట, సిరివిందు, దయాంబుధి, యోగి బృందముల్
డెందములందు గోరెడు కడింది నిధానము సేర వచ్చెనో
సుందరులార రండు చని చూతము కన్నుల కోర్కి దీరగన్'

'ఓ ఇందువదనలారా! నందుని తపస్సుకు ఫలమైనవాడు, వాసికెక్కిన మేలి గుణాల చాలు- రాశి, గోప తొగకంటుల (సుందరుల) నోముల పంట, ఇందిరా సుందరి (లక్ష్మి) హృదయానికి విందు- పరమానందం అందించువాడు, కరుణకు వరుణాలయుడు- సముద్రుడు, పరమ యోగి బృందాలు తమ డెందాలలో- హృదయాలలో కోరుకొనే కడింది- అపురూపమైన పెన్నిధి అయిన గోవిందుడు వస్తున్నాడు. కన్నుల కోరిక తీరేటట్లు కందాం రండి' అంటూ నందనందనుని సందర్శించడానికి తొందరపడుతూ ఒకరినొకరు పిలుచుకున్నారు. వారు భోజనాలు చేస్తూ భాజనా- గిన్నెలను అవతలకు నెట్టారు. పరున్న వారు పడకలు వీడారు. స్నానాలు ఆడుతున్న మానవతులు- స్త్రీలు మధ్యలోనే మానివేశారు. రమణులతో రమణీయంగా రమిస్తున్నవారు కూడా గణనీయంగా విరమించారు. గురువుల- పెద్దల వద్ద శిక్షణ పొందుతున్న ముద్దుగుమ్మలు, అది బరువని- వద్దనుకొని గ్రద్దన- వేగంగా బయటపడ్డారు. ఇంటి పనులలో నిండా మునిగి ఉన్న వాల్గంటులు కూడా వాటిని విడిచి పరుగుపరుగున వచ్చారు. చంటిపిల్లలను ఎత్తుకొని మోస్తున్న కిన్నెర కంఠులు తత్తరపడి చిన్నవారిని దింపివేశారు. తీరుబడిగా అలంకరించుకుంటున్న తరుణులు తడబడి చీరలు, హారాలు, పూదండలు, మైపూతలు తారుమారుగా ధరించి వచ్చారు. ఎత్తయిన బంగారు మేడలపై ముత్తయిదువులు గుంపులుగా చేరి మత్తచిత్తలై వారిజాక్షుని అవ్వారిగా- తనివి తీర వీక్షించి మనువు- జన్మ సఫలమని భావించారు. మధురా నగరపు అన్నువులు- స్త్రీలు చిన్నికృష్ణుని లీలా విలాసాలు విన్నవారే కాని, కన్నయ్యను ఎన్నడూ కన్నవారు కారు. అప్పటి వారి మనోభావాలను సహజ పాండిత్యుడు పోతన తనదైన కవన శైలిలో ఇలా వినసొంపుగా కనబరచాడు.

సీ|| 'వీడటే రక్కసి విగత జీవగ జన్ను,
బాలు ద్రావిన మేటి బాలకుండు
వీడటే నందుని వెలదికి జగమెల్ల,
ముఖమందు జూపిన ముద్దులాడు
వీడటే, మందలో వెన్నలు దొంగిలి,
దర్పించి మెక్కిన దాపలీడు
వీడటే యెలయించి వ్రేతల మానంబు,
సూరలాడిన లోక సుందరుండు
తే|| వీడు లేకున్న పుర మటవీస్థలంబు
వీని బొందని జన్మంబు విగత ఫలము
వీని బలుకని వచనంబు విహగరుతము
వీని జూడని చూడ్కులు వృథలు వృథలు'

...'పసితనంలో మాయా (అవిద్యా) రక్కసి పూతన కసిగా ఇచ్చిన విసపు చనుబాలు త్రాగి దానిని ఉక్కడగించి అక్కున చేర్చుకొన్న- మోక్ష మిచ్చిన మేటి శిశువు ముకుందుడు వీడేటే! మన్ను తిని కూడా తిననట్లు నటించి కన్నతల్లికి తన ముఖంలో, మిన్ను మన్ను ఏకంగా జగమెల్ల- తన్ను, తల్లిని కూడా చూపిన వన్నెచిన్నెల ముద్దులాడు- చెన్నుడు (చక్కనయ్య) వెన్నుడు వీడేటే! మందలో గోపికల బృందాలు తమ మందిరాలలో దాచుకొన్న పాలు, పెరుగు, వెన్నలను, కాచి (వేచి ఉండి) దోచుకొని దర్పించి, తోటి గొల్లపిల్లలకు అర్పించి, తిన్న చిన్నికృష్ణుడు వీడేటే! అమాయకురాండ్రైన గోప కుమారికల వస్త్రాలను- మానధనాన్ని చూరగొన్న చోరధీరుడు, మార జనకుడు- విష్ణువు వీడేటే! వీడు లేని నగరం బీడువారిన- ఎండిపోయిన అడవియే! వీని పొందు లభించని (ఇందు నిభాస్యల- మగువల) జన్మ పాడుపడినదే, ఎందుకూ పనికిరానిదే! నెలతలారా! వీనిని గురించి పలుకని వాక్కులు పక్షుల పలుకూతల వంటివే! వేల మాటలేల? ఈ బాలగోపాలుని చూడని చూపులు చాల చాల వృథలు- వ్యర్థాలు!' అంటూ ఆ పౌర కామినులు రామకృష్ణులపై పూలవానలు కురిపించారు.




శుకుడు- రాజా! ఆ సమయంలో కృష్ణుడు, రాజవీధిలో వస్తున్న కంసుని ఆస్థాన రజకుని చూచి- 'ఓ రజకకుల తిలకా! మేము మీ నగరానికి అతిథులం. మీ రాజుగారి మేన అల్లుళ్లం. మా మందలో అంత అందమైన వస్త్రాలు లేవు. నీ మూటలోని దీటు- సరిపోలు వస్త్రాలు మాకిచ్చెయ్యి. నీకు సాటిలేని మేలు జరుగుతుంది' అన్నాడు. వాడు కోపించి రెచ్చిపోయి పొగరుగా, రామకృష్ణులు నొచ్చుకొను విధంగా హెచ్చుస్వరంతో దుర్భాషలాడాడు. గోప కిశోరునికి కూడా కోపం వచ్చి, అతనిని తన ముంజేతితో తల ఊడి పడేటట్లు కొట్టాడు. నేల కూలిన రజకుని చూచి వాని మనుషులు, దగ్గరున్న ప్రజలు బిగ్గరగా అరచి భయంతో పారిపోగా; శౌరి, సంకర్షణుడూ మూటలో ఉన్న తమకు వాటమైన వస్త్రాలు ధరించి బాటలో ముందుకు సాగిపోయారు.

రామాయణంలోని ఉత్తరకాండలో లోకోత్తర చరిత్ర (సీతాయాశ్చరితం మహత్) కలిగిన భామామణి, భూజాత, రామపత్ని, అంతర్వత్ని (గర్భవతి) సీత అకారణ అరణ్యవాసానికి కారణమైన ఆ రజకుడే ఈ నిర్ణేజకుడు- రేవడు అని వ్యాఖ్యానం. 'క్రోధోపి దేవస్యవరేణ తుల్యః' - (దేవదేవుని ఆగ్రహం కూడా అనుగ్రహం వంటిదే). కర్మఫలం అనుభవింప జేసి పరమాత్మ అతనికి జన్మరాహిత్యం అనుగ్రహించాడు. శుకుడు- రాజా! ఆ పైన ఒక వాయకుడు- చేనేత పనివాడు దారిలో వస్తున్న మధురా నాయకులను, నరవరులను- రామకృష్ణులను చూచి పరవశించి, అర్చించి వారికి పలు రంగుల మెత్తని వస్త్రాలను, ఆభరణాలను సమర్పించాడు. హరిహలులు వానిని స్వీకరించి, సింగారించుకొని కరి (ఏనుగు) గున్నల మాదిరి చెన్ను (అందం, వన్నె) వహించారు. శ్రీధరుడు ప్రసన్నుడై వానికి సారూప్యాన్ని, సంపదను ప్రసాదించాడు. అనంతరం రామశ్యాములు సుదాముడనే మాలాకారుని- పూలమాలలు అల్లి, వాటిని అమ్ముకొని జీవించే కడు పేదవాని, పరమ భాగవతుని గృహానికి వచ్చి సేద తీరారు. ఆ బీద భక్తుడు సుదాముడు దామోదర రాములకు మిక్కిలి సుగంధ భరితాలైన రెండు చక్కని కుసుమ దామా(దండ)లను సమర్పించాడు. వాని ఏకాంత భక్తికి మెచ్చి లోకాంతరంగుడు శ్రీకాంతుడు 'నీ కోరిన వరమిచ్చెద, కోరుకోమ'ని అనగా ఆ అనఘుడు, ఘనయశుడు నంద తనయుని ఇలా కోరాడు...

క|| 'నీ పాద కమల సేవయు
నీ పాదార్చకులతోటి నెయ్యము నితాం
తాపార భూతదయయును
తాపస మందార! నాకు దయసేయ గదే!'

'తాపసులకు కల్ప పాదపం (వృక్షం) వంటివాడా! గోవిందా! నీ పాద అరవిందాల పరిచర్యను, నీ పాదాలను పూజించే పరమ భక్తులతో చెలిమిని, సర్వప్రాణుల మీద అఖర్వ- అపరిమితమైన దయను, ఓ దానవ గర్వహరా! నాకు ప్రసాదించు'. కోరినవి అనుగ్రహించి శౌరి సుదామునికి బలం, ఆయుష్యం, తేజం, యశం, సిరిసంపదలు కూడా కరుణించాడు. పై కందం కన్నా మిన్నయైన ప్రోజ్ఝితకైతవ- నిష్కపటమైన భాగవత ధర్మం ఉన్నదా? భక్త జనులందరికీ ఉదార, ఉదాత్త, మహోన్నత, ఆదర్శప్రాయమైన కోరిక! భగవంతుని చేరికకు అతి సులభ, సురక్షిత సాధనం. తరతరాలుగా కరతలామలకంగా తెలుగువారి డెందాల (హృదయాల) మందారాలలో భక్తి మాధుర్య మరందాలు చిందిస్తున్నది ఈ అందమైన కందం. శుకయోగి- రాజా! అబ్జాక్షుడు రాజవీధిలో సాగిపోతూండగా, తనకు ఎదురుగా పలు లేపనాలు- సుగంధ భరితాలైన మైపూతల పాత్ర పట్టి తలదించుకు వస్తున్న 'ఆననరుచి నిచయ వినమితాబ్జ' (ఆ ఇంతి ముఖ కాంతి ముందు మహోత్పలం (కమలం) కూడా తల వంచుకుంటుంది) యైన కుబ్జను, మరుగుజ్జు పిల్లను చూచాడు. పరమాత్మ ఆమెను ఇలా ఆప్యాయంగా పలకరించాడు. 'ఓ వనజాక్షీ! నీవెవరి దానవు? నీ పేరేమిటి? ఈ అంగరాగాలు ఏ శుభాంగునికి సమర్పిస్తావు? ఇవి మాకు ప్రసాదిస్తే నీవు చక్కగా ప్రకాశిస్తావు.' ముకుందుని మాటలు విని ఆ ముగుద (యువతి) ఇలా అన్నది...

ఉ|| 'చక్కనివాడ వౌదు, సరసంబుల నొంపకు, మెల్లవారికిన్
జక్కదనంబు లెక్కడివి? చారు శరీర! త్రివక్ర యండ్రు, నే
నిక్కము కంసుదాసిని, వినిర్మల లేపన విద్యదాన, నన్
మిక్కిలి రాజు మెచ్చు, దగమీరు విలేపనముల్ ధరింపరే?'...

'ఓ సుందరాకారా! నీవు భలే అందగాడివేలే! సరసాలతో నన్ను సాధించి, వేధించకు. నీ చమత్కారాలు చాలించు. అరవింద నేత్రా! నీవంటి అందాలు అందరికీ ఎక్కడినుంచి వస్తాయి. నా పేరు 'త్రివక్ర' (మెడ, వక్షము, నడుము- ఇలా మూడు వంకరలు). నేను కంస మహారాజు దాసిని. అచ్చమైన అంగరాగాలు చేయడమే నాకు వచ్చిన, నచ్చిన విద్య. నన్ను రాజు ఎంతో మెచ్చుకుంటాడు. ఈ విలేపనాలన్నీ మీరు స్వీకరించరా?' అంటూ ఆ కుబ్జ ప్రేమతో వారికి మైపూతలు సమర్పించింది. వానిని తన మేనుకు అలదుకొని యదువీరుడు మిక్కిలి ముదమంది, ముచ్చ్వంపుల దాని మేనును చక్క చేయనెంచాడు. దాని మీగాళ్ల మీద తన పాదాలుంచి తొక్కిపట్టి, రెండు వేళ్లను గడ్డం క్రింద పెట్టి దేహం సాగునట్లుగ పైకెత్తాడు. అంతలో ఆ ఇంతి వంపులు దీరి కంతుని- మన్మథుని సమ్మోహనాస్త్రం వలె చక్కని చుక్కగా మారి నందగోకుల విహారిని- కమలాక్షుని కాంక్షతో చూచింది. 'ఓ పంచశరా (మన్మథా)కారా! (తుంట విలుతుని వంటివాడా!) నా ఇంటికి వేంచేయుము'- అంటూ నందు పట్టి పై పుట్టం (ఉత్తరీయం) చెరగు పట్టుకొని లాగింది. శ్యాముడు బలరాముని చూచి నవ్వుతూ- 'ఓ ఇందుముఖీ! నా వచ్చిన పని సాధించిన తరువాత నీ మందిరానికి వస్తా. ఓ చిలుకల కొలికీ! నేటికి అలుకమాను' అంటూ ఆ కలికిని- కుబ్జను సాగనంపాడు. రామాయణంలో రాముని మోహించి, తన్ను పెళ్లాడమన్న కామిని శూర్పణఖయే కంజముఖియైన ఈ భామిని 'కుబ్జ' అని వ్యాఖ్యానం. ఆధ్యాత్మికంగా, కామ క్రోధ లోభాలనే త్రిదోషాలతో వక్రమైన మానవ బుద్ధియే త్రివక్ర. బుద్ధి అహంకార స్వరూపుడైన కంసుని సేవిస్తే వికృతమవుతుంది. కంసారి- కృష్ణుని సేవిస్తే సుకృతమై సంసారంపై విజయం సాధిస్తుంది! (సశేషం)


తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006


# బాడుగ పాత్ర

కథాసుధ

ఓ గ్రామంలోని గుట్ట మీద ఈశ్వరాలయం ఉంది. చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులు ప్రతి పౌర్ణిమ రోజున అక్కడ చేరి పూజలు చేస్తారు. ఆలయ నిర్వాహకులు అతిథి ఉపన్యాసకులను పిలిపించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పిస్తూ ఉంటారు. వచ్చిన భక్తులు రాత్రంతా మేలుకుని భక్తి వాతావరణంలో కాలం గడుపుతుంటారు. భక్తులందరికీ స్థానికులు భోజన సదుపాయం కూడా ఏర్పాటుచేస్తారు. ఓ పౌర్ణమి రోజు యథావిధిగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. భోజన సమయం కావడంతో అందరికీ భోజనం వడ్డిస్తూ ఉన్నారు. ప్రవచనకర్త అందరినీ పలకరిస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాడు. చాలా మంది తమకున్న ధర్మసందేహాలను ఆయన్ని అడిగి నివృత్తి చేసుకుంటున్నారు. అయితే వంట పనికి వచ్చిన ఒక మహిళ ఓ మూలగా కూర్చుని కన్నీళ్లు పెట్టుకోవడం గమనించాడు ప్రవచనకర్త. ఆమె దగ్గరికి వెళ్లి 'ఎందుకు ఏడుస్తున్నావ'ని అడిగాడు. 'మా ఊరి మనిషి చనిపోయాడని తెలిసింది. అందుకని ఏడుస్తున్నాను' అని బాధగా బదులిచ్చిందామె. వెంటనే ప్రవచనకర్త ఆమెను 'ఇక్కడ వంట చేయడానికి పాత్రలు ఎక్కడివి?' అని అడిగాడు. 'ఇంతమందికి వంట చేయాలంటే పెద్ద పాత్రలు కావాలి కదా, మన ఇండ్లలో ఉండేవి సరిపోవు, అందుకని అంగడి నుంచి బాడుగకు తెచ్చాం' అని సమాధానమిచ్చింది. 'వీటితో పని అయిపోయాక ఈ పాత్రలను ఏం చేస్తారు?' అని మళ్లీ ప్రశ్నించాడు. 'శుభ్రం చేసి అంగడి వారికి తిరిగి ఇచ్చేస్తాం' అని జవాబిచ్చింది. అప్పుడు ప్రవచనకర్త 'వంట పాత్రల్ని బాడుగకు తీసుకువచ్చాం. వంటకి వాడుకున్నాం. వంట పని పూర్తి అయ్యాక తిరిగి వారికే ఇచ్చేస్తాం. మన శరీరం కూడా అంతే... మన శరీరాన్ని ఆశ్రయించిన ఆత్మ తన పని పూర్తి అయ్యాక చెప్పా పెట్టకుండా వెళ్లిపోతుంది. ఉండమన్నా ఉండదు. ఇది సహజమైన విషయం. రాజైనా, కూలీ అయినా అందరం పోయే వాళ్లే. కాకుంటే ముందూ, వెనుకా... అంతే! నదులు సముద్రంలో కలవడం సహజమే కదా. దానికి బాధ పడటం ఎందుకు?' అని ధైర్యం చెప్పాడు. కళ్లు తుడుచుకుని ఆమె అక్కడినుంచి కదిలింది.




... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

# తపఃకాలం

క్రీస్తు సందేశం

వివిధ మత సంప్రదాయాల్లో వానప్రస్థాశ్రమం ప్రస్తావన కనిపిస్తుంది. ఈ ఆశ్రమంలో తపస్సు, గ్రంథపఠనం, ధ్యానం అనేవి ప్రధానంగా ఉంటాయి. ఇవి ఇప్పటికీ ఇంకా ఆచరిస్తున్నారా అంటే.. బాహ్యంగా కాకున్నా, అజ్ఞాతంగా కొందరు ఆచరిస్తున్నారనే చెప్పొచ్చు. క్రైస్తవ సమాజంలోనూ ఈ తరహా విధానం ఉంది. క్రీస్తుకు శిలువ వేసే రోజుకు ముందున్న నలభైరోజుల పాటు వారు ఈ తపోదీక్ష పాటిస్తారు. దీన్ని కొంతమంది 'తపఃకాలం' అని చెబుతారు. కొందరు క్రీస్తు శ్రమలకు సంబంధించిన ధ్యానంలో ఉంటారు కనుక శ్రమ దినాలని అంటారు. కొందరు గుడిలో కూర్చొని ధ్యానం చేస్తారు కాబట్టి, ఉపవాస దినాలంటారు. ఉపవాసం అంటే కొందరి దృష్టిలో ఒక్కపొద్దు పాటించడంగా భావిస్తారు. ఫస్కా పండుగకు ఆయత్త దినాలని కూడా అంటారు. ఈ నలభై రోజులూ ఒక్కపూట మాత్రమే ఆహారం తీసుకొంటారు. ఏదేమైనా పవిత్ర బైబిలు పఠనం, ధ్యానం, ఉపవాసాలు, ప్రార్థనలు, ఆత్మ పరిశీలనతో ఈ నలభై రోజులూ గడుపుతుంటారు. పాత జీవితానికి, చెడు ప్రవర్తనలకూ స్వస్తి చెప్పడమే వీటి వెనుకున్న ప్రధాన ఉద్దేశం. ఇవి పాటిస్తూనే దానధర్మాలు ఆచరిస్తారు. వ్యసనాలకు దూరంగా ఉంటారు. విలాసాలకు స్వస్తి పలుకుతారు. సత్కర్మలు ఆచరిస్తారు. ఇవన్నీ శ్రమదినాల్లో ఆచరించి.. క్రీస్తు మరణ దినమైన 'గుడ్ ఫ్రైడే'నాటికి ఉన్నతులుగా సిద్ధమవుతారు.



... డా|| దేవదాసు బెర్నార్డ్ రాజు, 98667 55024